క్లుప్తంగా

డీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


మారుతి, అధ్యక్షుడు


అరవింద్, ప్రధాన కార్యదర్శి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో డీటీఎఫ్ గాదిగూడ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎ.మారుతి, ఉపాధ్యక్షులుగా ఎల్.మహేశ్, కృష్ణకిశోర్ పాటిల్, ప్రధాన కార్యదర్శిగా కె.అరవింద్, కార్యదర్శులుగా కృష్ణ, సాయి కాంత్, జిల్లా కౌన్సిలర్లుగా శుద్ధోదన్, బాజీరావ్ ఎన్నికయ్యారు. డీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వృకోదర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఇదిలా ఉండగా కామన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయాలని, విద్యారంగాన్ని ప్రభుత్వాలు 30 శాతం బడ్జెట్ కేటాయించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తదితర తీర్మానాలు చేశారు.

చలివేంద్రాలు ప్రారంభం


బేల: నీళ్లు అందిస్తున్న సంధ్యారాణి

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో ఆర్టీసీ బస్‌షెల్టర్ వద్ద సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రత్యేక అధికారి సంధ్యారాణి ప్రారంభించారు. ప్రయాణికులకు నీళ్లను అందజేశారు. కార్యదర్శి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామంలో ఎర్రం వెంకటమ్మ జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ దిలీప్ కుమార్ ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. వెంకటమ్మ భర్త విఠల్, కుటుంబ సభ్యులు నర్సింగ్ రావు, కనక రమణ, ప్రభాకర్, మాజీ సర్పంచ్ భూమన్న, పంచాయతీ కార్యదర్శి అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


పోస్టర్లను తొలగింపజేస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండలంలోని ఆరెపల్లి గ్రామంలో సోమవారం ఆయనపర్యటించారు. ఈ సందర్భంగా గోడలపై అతికించి ఉన్న పోస్టర్లను సిబ్బంది ద్వారా తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రచార పోస్టర్లు ప్రదర్శించరాదని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇచ్చోడ: మండలంలోని తలమద్రి గ్రామానికి చెందిన బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెపెల్లి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం ఆయనకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పార్టీ కండువా కప్పారు. పార్టీపటిష్టత కోసం కృషి చేయాలని సూచించారు. టీపీసీసీ కార్యదర్శి సత్తుమల్లేశ్, వైస్ ఎంపీపీ జలై జాకు ఉన్నారు.

గాలికుంటు శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో ఏప్రిల్ 5 వరకు దశలవారీగా నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకా శిబిరాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి దూద్‌రాం రాథోడ్ కోరారు. మావల మండల కేంద్రంలో సోమవారం గాలికుంటు టీకాల వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు టీకాలు అందజేశారు.

ఇచ్చోడ: మండంలోని సాథ్‌నంబర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో పశు వైద్యసిబ్బంది శేఖర్, దేవ్‌రావు సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు అందజేశారు.

అవగాహన కల్పించాలి

నేరడిగొండ: ఎండల తీవ్రత పెరగడంతో వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని లైవ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ కోరారు. జిల్లాకేంద్రంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను సోమవారం కలిసి విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించారని, వైద్యసిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నట్లు వివరించారు.

ఊపందుకున్న ఉపాధి

- గ్రామాల్లో పెరుగుతున్న కూలీల సంఖ్య
- క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ


జామిడిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తాంసి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలవ్యాప్తంగా ఉపాధి పనులు ఊపందుకున్నాయి. కూలీలు, రైతులు, పురుషులు, మహిళలు ఉపాధి పనికి వెళ్తున్నారు. ప్రస్తుతం రోజురోజుకూ వీరి సంఖ్య పెరిగిపోతోంది. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో పలువురు ఉపాధి పని చేసేందుకు ముందుకొస్తున్నారు. అలాగే జాబ్‌కార్డు ఉన్న కూలీలందరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఇప్పటికే అవగాహన కల్పించారు. గ్రామసభలు ఏర్పాటు చేసి చేపట్టే పనులకు ప్రణాళికలు తయారు చేశారు.

13 జీపీలు.. 6202 జాబ్‌కార్డులు

మండలంలో మొత్తం 13 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 6,202 జాబ్‌కార్డులు ఉన్నాయి. మొత్తం 11,387 మంది కూలీలు ఉన్నారు. వీటిలో 3,700 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా 6,457 మంది కూలీలు ఏటా పనికి వెళ్తారు. ఉదయం పూట 100 నుంచి 250 మంది వరకు కూలీలు పనులకు వెళ్తున్నారు. గ్రామాల్లో ముళ్లపొదలు తొలగించడం, చెరువులో పూడిక, కాలువల పూడికతీత, కందకాలు, గుంతల తవ్వకాలు తదితర పనులు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

నీడ వసతి కల్పించాలి



గతనెల క్రితం నర్సరీల్లో ఉపాధి పనికి వెళ్లాను. మొక్కల పెంపకం బ్యాగుల్లో మట్టి నింపి బెడ్‌గా అమర్చాం. ప్రతీరోజు ఉపాధి పనికి వెళ్తున్నా. చేన్లలో రాళ్లకట్టలు, కందకాలు తవ్వుతున్నా. పనిచేసే చోట నీడ వసతి కల్పించాలి.
– బాలకిష్టు ఉపాధి కూలీ, తాంసి

సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధి పనులపై కూలీలకు ఇప్పటికే అవగాహన కల్పించాం. గతంలో కన్నా కూలీల సంఖ్య పెరిగింది. వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో పురుషులు, మహిళలు పనికి వస్తున్నారు. జాబ్‌కార్డ్ ఉన్నవారు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి.
– విజయ, ఏపీవో, తాంసి

సద్గురుల బోధనలు పాటించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న రామగిరి మహారాజ్ భక్తులు

నేరడిగొండ: ప్రతిఒక్కరూ సద్గురుల బోధనలు పాటించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని లఖంపూర్ శివారులో గల శ్రీ సద్గురు చైతన్య రామగిరి మహారాజ్ ఆశ్రమాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామగిరి మహారాజ్ భక్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కాగా ఆలయ అభివృద్ధి కోసం తన వంతుగా సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, నేరడిగొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, నాయకులు దేవేందర్ రెడ్డి, డాక్టర్ జహీర్, అంబాజీ, లింబాజీ, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పనీర్ తయారీ కేంద్రం ప్రారంభం

గుడిహత్నూర్: స్వయం సహాయక సంఘాల సభ్యులు, నిరుద్యోగ యువతీ, యువకులు స్థానిక వనరులను ఉపయోగించుకొని ఉపాధి పొందాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శివారాజ్, నవదర్గా స్వయం సహాయక సభ్యులు ముండే సత్యభామ, గన్నోజి జయశ్రీ శ్రీనిధి రుణం ద్వారా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన అకిరా పనీర్ కేంద్రాన్ని సోమవారం డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. స్థానికంగా లభిస్తున్న పాలతో పనీర్ తయారీ చేసి ఉపాధి పొందడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, మాజీ ఏఎంసీ చైర్మన్లు తిరుమల్‌గౌడ్, ఆడే శీల, పార్టీల నాయకులు జాదవ్ భీంరావ్ నాయక్, రమేశ్‌జాదవ్, బాలాజీ సోంటక్కె, కరాడ్ బ్రహ్మానంద్, సలీంఖాన్, మాధవ్ కేంద్రే, పవార్ రవీనాయక్ ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హీరాపూర్‌కు చెందిన రాథోడ్ ఊర్మిళ గుండెపోటుతో మృతిచెందింది. ఆమెకు ఎస్బీఐ లైఫ్ సరల్ శ్వధాన్ ప్లస్‌పాలసీ కింద మంజూరైన రూ.4,75,000 బీమా చెక్కును ఆదిలాబాద్ ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచి మేనేజర్ కార్తీక్ కుమార్ వంగ సోమవారం మృతురాలి తల్లిదండ్రులు రాథోడ్ రేణుక బాయి గణేశ్‌కు అందజేశారు. ఆదిలాబాద్ ఏజెన్సీ మేనేజర్ సురేశ్ నాయక్ , లైఫ్ మిత్రా అడ్వైసర్ జాదవ్ సవంత్‌రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీర్చారు..

సాక్షి స్పందన


ఆర్టీసీ కంట్రోలర్‌తో మాట్లాడుతున్న సీఐ భీమేశ్

ఇచ్చోడ: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు, వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వారు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 12న ట్రాఫికర్‌ శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి సీఐ భీమేశ్ స్పందించారు. ఇచ్చోడలో మెయిన్ రోడ్లపై ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలను సోమవారం తొలగింపజేశారు. రోడ్డుకు దూరంగా వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద బస్సులు నిలుపు స్థలాన్ని మార్చారు. నిర్మల్ వైపు వెళ్లే బస్సులను ఐబీ గెస్ట్‌హౌజ్ స్థలం వద్ద, ఆదిలాబాద్ వైపు వెళ్లే బస్సులను కుమురం భీం చౌక్ వద్దకు మార్చారు. ఐబీ ఖాళీస్థలంలో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల పార్కింగ్ కోసం చర్యలు చేపట్టారు. గతంలో బస్సులు నిలుపు స్థలంలో బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులు రోడ్లపై నిలపొద్దని కంట్రోలర్, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సీఐ భీమేశ్ మాట్లాడుతూ బైక్‌లను రోడ్లపై పార్కింగ్ చేయొద్దన్నారు. ఎస్సై నరేశ్, మేజర్ పంచాయతీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్, ఈవో సూర్యప్రకాశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమయపాలన ఏదీ?


ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు


వేచి చూస్తున్న ప్రజలు

తాంసి: మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. వివిధ ప్రాంతాల ప్రజలు సోమవారం ప్రజాపాలన కౌంటర్ వద్దకు వచ్చారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ కోసం సంబంధించిన పత్రాలతో వస్తే ఇక్కడ అధికారులు లేరు. కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. వారు వచ్చేవరకు కొంతసేపు వేచిచూశారు. ఉదయం 10.50 గంటలకు ఎంపీడీవో, ఆపై ఒక్కొక్కరుగా సిబ్బంది వచ్చారు. సకాలంలో వారు విధులకు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తీస్రీ బార్.. మోదీ సర్కార్

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


రవీందర్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

జైనథ్: తీస్రీ బార్.. మోదీ సర్కార్.. నినాదంతో మోదీని మూడోసారి ప్రధానిగా చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని ఖాప్రి, బెల్లూరి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఖాప్రిలో మాజీ సర్పంచ్ దంతెల రవీందర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు బీజేపీలో చేరగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ కేంద్ర నిధులు పక్కదారి పట్టించిందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

‘పది’ పరీక్షలు ప్రారంభం

- అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు
- తనిఖీ చేసిన సిబ్బంది


నార్నూర్: ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు చూస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: జిల్లావ్యాప్తంగా పది వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు జరిగే పరీక్షకు అరగంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. వారిని ఇన్విజిలేటర్లు, సిబ్బంది తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఇచ్చోడ జెడ్పీ, గిరిజన గురుకుల బాలికల, బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 977 మంది హాజరుకావల్సి ఉండగా 973 మంది పరీక్ష రాశారు. నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు తెలిపారు.

ఇంద్రవెల్లి: స్థానిక ఆశ్రమ బాలికల, జెడ్పీ, కేస్లాపూర్ ఆశ్రమ బాలికల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆశ్రమ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు 199 మంది పరీక్ష రాయగా, ఒకరు గైర్హాజరయ్యారు. జెడ్పీ పాఠశాలలో 255 మందికి 254 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఒకరు గైర్హాజరు కాగా, కేస్లాపూర్ పాఠశాలలో 218 మందికి 218 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో నారాయణ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేరడిగొండ: స్థానిక జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 172 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 200 మందికిగాను 199 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఏఎస్సై మారుతిలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

తలమడుగు: స్థానిక జెడ్పీ పాఠశాల కేంద్రంలో 200 మంది, బరంపూర్‌లో 196 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తహసీల్దార్ రాజమోహన్, ఎస్సై ధనశ్రీ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 960 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

బోథ్: బోథ్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, మోడల్, సొనాల, కౌఠ(బి) గ్రామాల్లోని జెడ్పీ సెకండరీ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా 649 మంది పరీక్ష రాశారు. ఒకరు గైర్హాజరయ్యారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తాంసి, కప్పర్ల, అందర్‌బంద్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 503 విద్యార్థులకు గాను 502 మంది పరీక్ష రాశారు. ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో శ్రీకాంత్ తెలిపారు. తాంసిలో పరీక్ష కేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ విష్ణు తనిఖీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర ఉన్నారు.

నార్నూర్: స్థానిక ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 208 మంది విద్యార్థులకుగాను 208 మంది పరీక్ష రాశారు. తాడిహత్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 191 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. గాదిగూడ ఆశ్రమ పాఠశాలలో 165 మందికి గాను 164 మంది పరీక్ష రాయగా, ఒకరు హాజరుకాలేదని ఎంఈవో రాపల్లి ఆశన్న తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: యాపల్‌గూడలో రెండు పరీక్ష కేంద్రాలు, మామిడిగూడలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను ఎంఈవో జయశీల తనిఖీ చేశారు. కేంద్రాల్లో 514 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

బేల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 198, ఎస్టీ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో 105, సాంగిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 92 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 395 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు.


బోథ్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు


ఇంద్రవెల్లి: హాల్ టికెట్ నంబర్ చూస్తూ..


బేల: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

కార్మికులకు క్యాజువల్ సెలవులు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికులకు జీవో ప్రకారం ఏడాదికి 15 క్యాజువల్ సెలవులు ఇవ్వాలని మున్సిపల్ ఎంప్లాయిస్-వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ మున్సిపల్‌లో కార్మికులకు క్యాజువల్ సెలవులను అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు సెలవులు వెంటనే అమలు చేయాలన్నారు. లేకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు. సంఘం సలహాదారులు గాజుల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెరుగు చిరంజీవి, మంతెన కాంతారావు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిర్ర దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి ఎం.సందీప్ గుట్కా తింటున్నాడని ఉపాధ్యాయుడు చితకబాదాడు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సందీప్ ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో గుట్కా తింటున్నాడని ఉపాధ్యాయుడు ఇందల్‌కు సమాచారం అందింది. విద్యార్థిని పిలిచి గుట్కా ఎందుకు తింటున్నావని ఆగ్రహం వ్యక్తం చేశాడు. జేబులు వెతకగా గుట్కా ప్యాకెట్లు లభించడంతో వాతలు వచ్చేలా చితకబాదినట్లు ఆరోపించారు. విద్యార్థి కుటుంబీకులు ఉపాధ్యాయుడిని నిలదీశారు. అనంతరం ఉట్నూర్ ఐటీడీఏకు వెళ్లి ఆర్‌సీఓ గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు.

ఘనంగా శ్యామకి మాత పూజ


కలశంతో బయల్దేరుతున్న యువతులు

నార్నూర్: మండలంలోని ఉమ్రి గ్రామంలో శ్యామకి మాత పూజను ఆలయపూజారి రామ్ మహారాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పెళ్లి కాని యువతులు కలశంతో మహాపూజకు బయల్దేరారు. గ్రామ శివారున ఉన్న బావి నుంచి నీటిని తెచ్చేందుకు వెళ్లి తిరిగి వచ్చారు. అనంతరం శ్యామకి మాత విగ్రహాన్ని నీటితో శుద్ధిచేశాక మహా పూజను ప్రారంభించారు. తర్వాత నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, భక్తులు తరలివచ్చారు.

నర్సరీ నిర్వహణపై దృష్టిపెట్టాలి

నార్నూర్: నర్సరీ నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని ఏపీవో సురేష్ అన్నారు. మండలంలోని తాడిహత్నూర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని సోమవారం పరిశీలించారు. నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకంపై టీఏని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఉన్నందున మొక్కలు ఎండిపోకుండా నీరుపట్టాలన్నారు. టీఏ సాదిక్, ఎఫ్ఏ బాపూరావు ఉన్నారు.

సొనాలలో వర్షం

బోథ్: సొనాల గ్రామంలో సోమవారం వర్షం కురిసింది. పంటలు ఎండుతున్న తరుణంలో కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. మరోవైపు భూగర్భజలాలు తగ్గిపోవడంతో వర్షం కారణంగా బోర్లలో నీరు నిలిచే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ తనిఖీ


తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎస్సై

తలమడుగు: మండలంలోని అంతర్రాష్ట్ర లక్ష్మీపూర్ చెక్‌పోస్టును తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సై ధనశ్రీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సరిహద్దు గుండా అనుమతి లేని వాహనాలను అనుమతించమన్నారు. సరిహద్దు ప్రాంతంలో సంచరించే వాహనాలను సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఏఎస్సై సురేందర్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.